క్లుప్తంగా

యుద్ధప్రాతిపదికన సాయన్నగెడ్డ గండి పూడ్చివేత



గండి పూడ్చిన ప్రదేశంలో అధికారులు, స్థానికులు

సంతకవిటి: మండలంలోని గారన్నాయుడుపేట వద్ద ఉన్న సాయన్నగెడ్డకు పడిన గండిని యుద్ధప్రాతిపదికన మంగళవారం పూడ్చివేశారు. సోమవారం గండి పడగా, విషయం తెలుసుకున్న సంబంధిత శాఖ అధికారులు మంగళవారం గెడ్డ వద్దకు చేరుకుని, గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించి, పూడ్చివేయించారు. సాగునీటి సరఫరాకు అడ్డంకి తొలగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యవంతమైన పంట



సేంద్రియ ఎరువుల తయారీని వివరిస్తున్న ఏవో శ్యామసుందర్

బొబ్బిలి రూరల్: సేంద్రియ ఎరువుల వాడకంతో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని ఏవో శ్యామసుందర్ తెలిపారు. మండలంలోని కొత్తపెంట గ్రామ రైతులకు సేంద్రియ ఎరువుల తయారీ, వాటి ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతీ రైతు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలని చెప్పారు. అనంతరం శ్రీవరి సాగుపై అవగాహన కల్పించారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఉపేంద్ర

రాజాం సిటీ: రాజాం రూరల్ సీఐగా ఉపేంద్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎస్.కోటలో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ఎస్.శ్రీనివాసరావు విజయనగరం వన్‌టౌన్‌కు బదిలీపై వెళ్లారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామని, యువకులతో సమావేశాలు నిర్వహించి, చెడు వ్యసనాల బారినపడకుండా అవగాహన కల్పించనున్నామని ఉపేంద్ర తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలతో కుష్టువ్యాధి నివారణ



సర్వే చేస్తున్న సిబ్బంది

రాజాం: ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే కుష్టువ్యాధి నివారణ సాధ్యమేనని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి భార్గవి అన్నారు. పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆమె.. గ్రామాల్లో జరుగుతున్న లెప్రసీ సర్వేపై సమీక్షించారు. అన్ని గ్రామాల్లో మరోమారు సమగ్రంగా సర్వే చేసి, వ్యాధి నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇదిలా ఉండగా, పొగిరి, గురవాం, నందబలగ, లక్ష్మీపురం, అంతకాపల్లి, వీఆర్‌అగ్రహారం తదితర గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది లెప్రసీ సర్వే చేసి, వ్యాధి నివారణకు పలు సూచనలు చేశారు.

కౌలురైతులకు రుణాలు ఇవ్వండి



ఉనుకూరు ఏపీజీవీబీ మేనేజర్‌కు కౌలురైతుల జాబితాను అందజేస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని కౌలురైతులకు బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణాలు అందివ్వాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని దేవుదళ ఎస్‌బీఐ, ఉంగరాడమెట్ట ఏపీజీవీబీ, ఉనుకూరు ఏపీజీవీబీ, రేగిడి యూనియన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్లను ఆయన మంగళవారం కలిసి, కౌలు రైతుల జాబితా అందించారు. మండలంలో మొత్తం 195 మంది కౌలురైతులను గుర్తించామని, వారందరికీ 11 నెలల కాలపరిమితితో రుణాలు ఇవ్వాలని మేనేజర్లను కోరారు.

గుర్తింపుకార్డుల వితరణ

రాజాం సిటీ: స్థానిక పోలీస్‌స్టేషన్ రోడ్డులోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు గుర్తింపుకార్డులను రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్ మంగళవారం వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రత్యేక గుర్తింపునకు తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, చైతన్య, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు మంగళం..!

ఎన్నికలప్పుడు ఓట్ల కోసం కూటమి నేతలు లేనిపోని హామీలతో జనాన్ని ఊదరగొట్టారు. ముఖ్యంగా వలంటీర్లకు తామొస్తే నెలకు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక అవేమీ అమలు చేయనక్కర్లేదన్నట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్ వ్యవస్థను కొనసాగించరని ఓసారి.. పాత వలంటీర్లను విధుల్లోకి తీసుకోరని మరోసారి.. ఇంకోసారి ఊరికి ఒకరిద్దరే వలంటీర్లట అనే ఊహాగానాలు జోరుగా ప్రచారంలో ఉండడంతో వలంటీర్ ఉద్యోగంపై ఆశలు పెట్టుకున్న వారంతా ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి, రెండు నెలలైనా వలంటీర్ల నియామకం చేయకపోగా, ఒకప్పటి వలంటీర్ సేవలను సైతం ఇప్పుడు సచివాలయ సిబ్బందితో చేయిస్తుండడంతో ఇక వలంటీర్ల సేవలకు మంగళం పలికినట్లేనన్న అంతా భావిస్తున్నారు. ఎన్నికల హామీలను తప్పనిసరిగా అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

– రాజాం/రేగిడి/వంగర/సంతకవిటి



నాడు: లక్ష్మీపురంలో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి, పింఛన్ అందిస్తున్న గ్రామ వలంటీర్(ఫైల్)



నేడు: లక్ష్మీపురం వీధి శివారులో పింఛన్ డబ్బుల కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న లబ్ధిదారులు(ఫైల్)

- వలంటీర్లకు సేవలు కేటాయించని చంద్రబాబు ప్రభుత్వం
- పింఛన్‌దారులకు తప్పని పాట్లు
- ప్రజలకు చేరని సంక్షేమ సమాచారం
- గాలిలో దీపంలా రూ.10 వేల హామీ

రాజాం పట్టణంలో..

రాజాం మున్సిపాలిటీ పరిధిలో 11 వార్డు సచివాలయాల ద్వారా గతంలో 220 మంది వార్డు వలంటీర్లు సేవలు అందించేవారు. ప్రస్తుతం ఈ వలంటీర్లు లేకపోవడంతో ప్రజలకు అందాల్సిన సంక్షేమ సమాచారం అంతగా అందడం లేదు. పింఛన్‌దారులు కూడా పింఛన్ డబ్బులు అందుకునేందుకు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏ పథకం గురించి అయినా సమగ్ర సమాచారం వలంటీర్ల ద్వారా ప్రజలకు చేరేది. దాన్నిబట్టి ఏ పథకానికి ఎవరం అర్హులమన్న విషయం జనానికి ఇట్టే అర్థమయ్యేది. ఇప్పుడు ఆ వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. ఆగస్టుల నెలలో రాజాం పట్టణంలోని మొత్తం 4,167 మంది పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లు అందించాల్సి ఉండగా, 4,120 మందికే పింఛన్ అందించారు. మిగతా 47 మందికి పింఛన్ అందివ్వలేదు.

రాజాం మండలంలో..

రాజాం మండలంలో గతంలో మొత్తం 17 గ్రామ సచివాలయాల ద్వారా 297 మంది వలంటీర్లు సేవలందించేవారు. ప్రస్తుతం ఈ వలంటీర్లు లేకుండానే కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఏ పథకం వస్తుందో ఏ పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గతంలోని వలంటీర్లు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాల దగ్గర నుంచి ఈకేవైసీ నమోదు వరకు అన్నీ వలంటీర్లే దగ్గరుండి చేస్తూ ప్రజలకు సహకరించేవారు. ప్రస్తుతం ఈ సేవలన్నీ కనుమరుగయ్యాయి. ఆగస్టు నెలకు సంబంధించి, రాజాం మండలంలో 7,930 మందికి సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు అందించేందుకు ఏర్పాట్లు చేయగా, సుదూర ప్రాంతాల్లోని లబ్ధిదారులు చార్జీలు కట్టుకుని వచ్చి మరీ పింఛన్లు తీసుకున్నారు. మొత్తం 7,886 మందికే పింఛన్లు ఇవ్వగా, మిగిలిన 44 మందికి పింఛన్లు అందివ్వలేకపోయారు.

రేగిడి మండలంలో ..

రేగిడి మండలంలో 25 గ్రామ సచివాలయాల ద్వారా గతంలో 313 మంది గ్రామ వలంటీర్లు సేవలు అందించేవారు. వీరంతా ప్రతినెలా ఒకటో తేదీనే 10,855 మందికి పింఛన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్లు లేకపోవడంతో గ్రామాల్లోని శివారున ఉండే రచ్చబండల వద్దకు వెళ్లి, లబ్ధిదారులు పింఛన్ తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆగస్టు నెలకు సంబంధించి, మొత్తం 10,782 మందికి పింఛన్ అందించగా, మిగిలిన 73 మందికి పింఛన్ ఇవ్వలేదు.

సంతకవిటి మండలంలో..

సంతకవిటి మండలంలో గతంలోని 361 మంది వలంటీర్లు.. 24 గ్రామ సచివాలయాల ద్వారా సేవలందించేవారు. ఇప్పుడు ఆ వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో పింఛన్ డబ్బులు అందుకునేందుకు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన నెరవేర్చకపోవడంతోనే ఈ సమస్య తలెత్తింది. ఆగస్టు నెలకు సంబంధించి, మండలంలో మొత్తం 10,064 మందికి పింఛన్లు అందించాల్సి ఉండగా, 10,008 మందికి ఇచ్చి, మరో 56 మందికి ఇవ్వలేదు.

వంగర మండలంలో..

వంగర మండలంలో 19 గ్రామ సచివాలయాల ద్వారా 242 మంది గ్రామ వలంటీర్లు గతంలో సేవలందించేవారు. ఇప్పుడు ఆ వలంటీర్ల సేవలు లేకపోవడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మండలంలో మొత్తం 6,500 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, ఆగస్టు నెలలో 6,454 మందికి మాత్రమే పింఛన్ ఇచ్చారు. మిగిలిన 46 మందికి పింఛన్ అందివ్వలేదు.

దూరప్రాంతాలకు వెళ్లి, మరీ ఇచ్చేవాళ్లం..



సంతకవిటిలో గ్రామ వలంటీర్‌గా సేవలు అందించేవాడిని. నా పరిధిలోని ఏ కుటుంబానికి సేవలు కావాలన్నా వారి ఇంటి వద్దకే వెళ్లి వివరాలు సేకరించి, సకాలంలో సేవలు అందించేవాడిని. విశాఖపట్నం, విజయనగరం వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి మరీ నెల పింఛన్ ఇచ్చేవాళ్లం. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ వలంటీర్ వ్యవస్థ ఉంటే బాగుంటుందని అంటున్నారు.

– మాతా రమేష్, మాజీ గ్రామ వలంటీర్, సంతకవిటి.

ఏ విషయమైనా చెప్పేవారు..



గ్రామ వలంటీర్ వ్యవస్థ ఎంతో బాగుండేది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ఏ విషయమైనా సకాలంలో చెప్పేవారు. సచివాలయానికి వెళ్లకుండానే ఇంటి వద్దకే పథకం అందేలా పని చేసేవారు. తమకు సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అయ్యేది. మండల కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పని లేదు అప్పుడు. ఇప్పుడు వలంటీర్ సేవలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

– తాడ్డి భవాని, లక్ష్మీపురం, రాజాం మండలం.

డ్రాపౌట్ విద్యార్థులను ఓపెన్ స్కూల్‌లో చేర్పించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: డ్రాపౌట్ విద్యార్థులను ఓపెన్ స్కూల్‌లో చేర్పించాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 15 ఏళ్ల వయసు నిండి, చదువు మధ్యలో మానేసిన పిల్లలను ఓపెన్ స్కూల్‌లో పదో తరగతిలో చేర్పించేందుకు అన్ని శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలాగే పదో తరగతి పాసై చదువు మానేసి విద్యార్థులను ఓపెన్ స్కూల్‌లోని ఇంటర్మీడియట్‌లో చేర్పించాలని తెలిపారు. మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవో డీవీ అప్పారావు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి కనబరచాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు త్రినాధరావు, పాపారావు, ఓపెన్ స్కూల్ మండల కో–ఆర్డినేటర్ సూర్యనారాయణ, ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి



విద్యార్థి అభ్యసన సామర్థ్యం పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని ఆమిటి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల చేతిరాత, హోమ్‌వర్కు పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను వివిధ ప్రశ్నల ద్వారా గమనించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని తెలిపారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

ఓపెన్ స్కూల్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

రాజాం సిటీ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు సంబంధించి, రూపొందించిన బ్రోచర్‌ను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు తదితరులు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు. అంతకుముందు ఈ నెల 8వ తేదీన జరిగే ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికల నిర్వహణకు సంబంధించి, చర్చించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని సదరు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వై.రవికిరణ్, పి.నాగయ్య, టి.బలరాం తదితరులు పాల్గొన్నారు.

జ్వర నిర్ధారణ పరీక్షలు చేయండి



ఎస్.అగ్రహారంలో ప్రజారోగ్యంపై సమీక్షిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి మణి

సంతకవిటి: గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వారి ఇంటి వద్దనే జ్వర నిర్ధారణ పరీక్షలు చేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించిన ఆమె.. వైద్యారోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశమై పలు సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వాటి బారినపడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం గోళ్లవలస పంచాయతీలోని ఎం.ఆర్.అగ్రహారం, ఎస్.అగ్రహారం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించి, అక్కడికి సిబ్బందితో మాట్లాడి, గ్రామీణుల ఆరోగ్యంపై ఆరాతీశారు.

చెరకు పంట సాగుపై అవగాహన సదస్సు

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో చెరకు పంట సాగుపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ కేన్ డీజీఎం రమేష్ మాట్లాడుతూ చెరకు సాగులో మెలకువలను నేర్చుకోవాలని చెబుతూ ఐదు సూత్రాలను రైతులకు వివరించారు. కలుపు నివారణ చర్యలు, సకాలంలో ఎరువులు వేయడం, దూరపు సాళ్లు పద్ధతి, విత్తన ఎంపిక, సూక్ష్మపోషకాల వినియోగం వంటి వాటి ద్వారా దిగుబడులు పెంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌డీ మేనేజర్ రామచంద్రన్, కేన్ మేనేజర్లు కమల పటా్నయక్, మురళీ, డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

రాజాం/సంతకవిటి/రేగిడి: మండలాల్లోని పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాన రోడ్లలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడంతో పాటు కాలువల్లోని పూడికలు తొలగించారు. అనంతరం రోడ్లుకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. మరికొన్నిచోట్ల దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టారు.

రేషన్ డిపో డీలర్ మృతి

తెర్లాం: మండలంలోని కాగాం గ్రామానికి చెందిన రేషన్ డిపో డీలర్ జిల్లేల్ల తాడు(70) సోమవారం రాత్రి మృతి చెందారు. రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రకు ఉపక్రమించిన ఆయన ఉదయం చూసేసరికి మృతి చెంది ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన గత 30 ఏళ్లుగా రేషన్ డిపో డీలర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. డీలర్ మృతి విషయం తెలుసుకున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్, సీఎస్‌డీటీ స్వర్ణలత, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, సంఘ సభ్యులు, డీలర్లు ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించి, బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న సంఘ సభ్యులు

రాజాం సిటీ: పట్టణంలోని మాదిగ వీధికి చెందిన నిరుపేద మహిళ అయిన ఆరని ఆదిలక్ష్మికి విజయనగరానికి చెందిన మాతృభూమి సేవా సంఘం సభ్యులు మంగళవారం ఆర్థికసాయం అందించి, తమ ఔదార్యం చాటుకున్నారు. ఇటీవల ఆమె భర్త మృతి చెందడంతో పిల్లల చదువుల నిమిత్తం తమవంతు సాయంగా రూ.15 వేలు అందించామని ఆ సంఘ కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు తెలిపారు. అలాగే ఆమెకు జీవనోపాధి కలిగేలా కుట్టుమిషన్ కూడా త్వరలో అందించనున్నామన్నారు. కార్యక్రమంలో జె.ఈశ్వరప్రసాద్, జె.గోవిందరావు, టి.శ్రీనివాసరావు, స్వచ్ఛ పొగిరి సేవా సమితి అధ్యక్షుడు ఎస్.రాము పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో చేపడుతున్న ఓడీఎఫ్(ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ/బహిరంగ మల విసర్జన రహిత) సర్వేను ఎంపీడీవో పి.రవికుమార్ మంగళవారం పరిశీలించారు. మరుగుదొడ్లు తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. బహిరంగ మల విసర్జన నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు లేని వారి జాబితాను సేకరించడం జరుగుతోందన్నారు. బహిరంగ మల విసర్జన చేస్తే దాన్ని నేరంగా పరిగణించి, జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



తెర్లాంలో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన



రామభద్రపురం: వంగపండువలసలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



రేగిడి: చాటాయివలసలో తల్లిపాల వారోత్సవాలు



బొబ్బిలి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బిడ్డకు తల్లిపాల ఆవశ్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని, తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని, పుట్టిన శిశువుకు కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని, తల్లిపాలు తాగిన శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, ఎటువంటి వ్యాధులు సోకవన్నారు. బిడ్డకు పాలివ్వడాన్ని బాధ్యతగా ప్రతీ తల్లి భావించాలన్నారు. పలుచోట్ల గర్భిణులకు సీమంతం నిర్వహించారు.

– బొబ్బిలి, రాజాం

ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



వంగర: మాట్లాడుతున్న తహసీల్దార్ ధర్మరాజు



సంతకవిటి: మాట్లాడుతున్న ఎంఈవో భాస్కరరావు

వంగర: పాఠశాలల్లో ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని తహసీల్దార్ డి.ధర్మరాజు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆయన.. ఈ నెల 8వ తేదీన జరగనున్న ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వైవీ జనార్దన్, డీటీ బూరాడ సుందరరావు, ఎంఈవో వై.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, ఎంఈవో–2 సీహెచ్ భాస్కరరావు మంగళవారం సమావేశమై, ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ శంకర్, ఎంఈవో శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం..!

- శిథిలావస్థలో మురికిగెడ్డ ఓపెన్ చానల్ షట్టర్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- శ్రమదానం చేసి మరీ తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్న రైతులు



సంకిలి వద్ద ఓపెన్‌హెడ్ చానల్ వద్ద కర్రలతో షట్టర్లు నిలబెట్టిన దృశ్యం

రేగిడి: మండలంలోని అధికారుల నిర్లక్ష్యం..రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలోని సంకిలి వద్ద మురికిగెడ్డ ఓపెన్ చానల్(కాలువ) వద్ద ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన షట్టర్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇవి ఇటీవల వరదలకు కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి వాటిని బాగుచేయకపోవడంతో ఈ కాలువ ద్వారా పంటపొలాలకు అందాల్సిన సాగునీరు సక్రమంగా అందడం లేదు. ఇదే విషయమై అధికారులను రైతులు కలిసి, విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఇదే కాలువ సాగునీటిపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్న మండలంలోని సంకిలి, పుర్లి, దేవుదళ, ఖండ్యాం, కొమెర, వెంకటాపురం, మంగళపేట, ఆడవరం, లక్ష్మీపురం రైతులంతా మంగళవారం ఒక్కటై శ్రమించారు. షట్టర్‌ల తలుపుల స్థానంలో తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. కర్రలతో బలమైన అడ్డుకట్ట వేసి, షట్టర్లను నిలబెట్టారు. సాగునీటి సరఫరాకు మార్గం సుగమం చేసుకున్నారు. ఈ మంచి పని చేసిన రైతులను పలువురు అభినందిస్తున్నారు. ఇదే కాలువ ద్వారా 11 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా కావాల్సి ఉందని, షట్టర్లు త్వరగా బాగుచేయాలని రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు కోరుతున్నారు.